
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం ¦ 1 ¦ ఫిబ్రవరి ¦ 2025



సోమశిలలో 67.078 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 67.078 టీఎంసీలు ఉన్నాయి. 1838 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువ కాలువలకు 3950 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.84,770
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,717
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,949
నవర (8 గ్రాములు)	రూ.63,592

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.8 /23.2

జిల్లాలో వాతావరణం శనివారం పొడిగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శుక్రవారం 75 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

లక్ష పనిదినాల కల్పనే లక్ష్యం

- డ్వామా పీడీ గంగా భవాని



మాట్లాడుతున్న గంగా భవాని

నెల్లూరు (పొగతోట): ఉపాధి హామీ పనులకు సంబంధించి ప్రతి రోజూ లక్ష మంది కూలీలు పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ గంగా భవాని ఎంపీడీఓలు, ఏపీడీలు, ఏపీఓలను ఆదేశించారు. శుక్రవారం డ్వామా కార్యాలయం నుంచి వివిధ మండలాల ఎంపీడీఓలు, ఏపీడీలు, ఏపీఓలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రూపుల ఏర్పాటు రెండు రోజుల్లో పూర్తి చేసి ఉపాధి పనుల లక్ష్యాన్ని చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. మేట్లను నియమించడం వల్ల ఎఫ్ఏలు లేని ప్రాంతాల్లో సమస్య తగ్గుతుందన్నారు. గోకులాల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసి, ఫిబ్రవరి మొదటి వారంలోపు బిల్లులను అప్‌లోడ్ చేయాలని సూచించారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

- డీఎంహెచ్ఓ సుజాత



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ సుజాత

నెల్లూరు(అర్బన్): స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చేసినట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ సుజాత హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై జిల్లా స్థాయి సలహా మండలి సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ భ్రూణ హత్యలను నివారించడం కోసమే లింగనిర్ధారణ పరీక్షపై ఆంక్షలు విధిస్తూ చట్టం వచ్చిందన్నారు. స్త్రీ, పురుష నిష్పత్తి సమతుల్యం కావాలన్నారు. జిల్లాలో ప్రతి 1000 మంది బాలురుకు 1011 మంది బాలికలు ఉన్నారన్నారు. స్కానింగ్ సెంటర్లపై ఆకస్మికంగా డెకోయ్ ఆపరేషన్లు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. బాల్యవివాహాలు నిరోధించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు డాక్టర్ సర్దార్‌సుల్తానా, డాక్టర్ కిరణ్, అనాటమి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ స్వర్ణరెడ్డి, డివిజనల్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ దయాకర్, ఎన్‌జీఓలు కవితారెడ్డి, శ్రీనివాసరావు, కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయాలు కిటకిట

- నేటి నుంచి మార్కెట్ విలువ పెంపు దృష్ట్యా క్యూ కట్టిన జనం
- జిల్లా వ్యాప్తంగా ఒక్క రోజే 750పైగా రిజిస్ట్రేషన్లు
- రాత్రి 9 గంటల వరకు కొనసాగిన ప్రక్రియ



డాక్యుమెంట్లు సిద్ధం చేయడంలో రైటర్లు బిజీబిజీ

నెల్లూరు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి మార్కెట్ విలువలు పెంచుతూ తీసుకున్న నిర్ణయంతో రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగనున్న దృష్ట్యా జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు శుక్రవారం రాత్రి వరకు కిటకిటలాడాయి. జిల్లాలో శనివారం నుంచి ప్రాంతాన్ని బట్టి 10 నుంచి 50 శాతం వరకు భూమి విలువ పెరగనుంది. ఈ క్రమంలో ఒక్కసారిగా క్రయవిక్రయదారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు క్యూకట్టారు. గురువారం సర్వర్లు మొరాయించడంతో పలు రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో శుక్రవారం భారీగా జనం తరలి రావడంతో కార్యాలయాల్లో రద్దీ నెలకొంది.

ఒక్క రోజులో 750 పైగా రిజిస్ట్రేషన్లు


జిల్లాలో సాధారణంగా సగటున రోజుకు 200 నుంచి 300 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. అయితే ఎన్నడూ లేని విధంగా ఒక్క రోజులోనే శుక్రవారం ఒక్క రోజే 750కి పైగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. నెల్లూరు నగరం, కావలి పట్టణా ల్లోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అత్యధికంగా రిజిస్ట్రేషన్లు జరిగినట్లు సమాచారం. అయితే పలు కార్యాలయాల్లో రాత్రి 9 గంటల వరకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగింది.

మొరాయించిన సర్వర్లు

రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్లు భారీగా జరగడంతో సర్వర్లపై ప్రభావం చూపింది. దీంతో జిల్లాలోని 15 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సర్వర్లు శుక్రవారం కూడా పలు దఫాలుగా మొరాయించడంతో గంటల తరబడి జనం పడిగాపులు కాయాల్సి వచ్చింది. కేవైసీ, ఈ సైన్‌లు పలుమార్లు జరగకపోవడంతో దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

హార్బర్‌పై మీన మేషాలు





ఫిషింగ్ హార్బర్‌లో బకింగ్‌హాం కెనాల్‌పై బ్రిడ్జి నిర్మించాల్సిన ప్రదేశం

- వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయిన నిర్మాణం
- ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించి ఐదు నెలలు అయినా.. వినియోగంలోకి రాని వైనం
- మరో వైపు సముద్రంలో పెద్దబోట్లతో మత్స్య సంపదను దోచుకెళ్తున్న తమిళ జాలర్లు
- వేట సాగక.. పూట గడవని దుస్థితిలో మత్స్యకారులు

ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపే జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను అందుబాటులోకి తెచ్చే అంశంపై స్పష్టత కొరవడుతోంది. నెలల తరబడి జాప్యం జరుగుతోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో హార్బర్ పనులు ప్రారంభించి చాలా వరకు పూర్తిచేశారు. దాదాపు పూర్తయిన ఆ హార్బర్‌ను ప్రారంభించాల్సిన తరుణంలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో వాయిదా పడింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ప్రధాని వర్చువల్‌గా దీన్ని ప్రారంభించి ఐదు నెలలు గడిచినా.. వినియోగంలోకి రాలేదు.

కావలి: జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను మత్స్యకారులకు అంకితం చేయడంలో కూటమి సర్కార్ మీనమేషాలు లెక్కిస్తోంది. మత్స్యకారులకు పెద్ద బోట్లు సరఫరా చేసి హార్బర్‌ను వినియోగంలోకి తీసుకురావాల్సి ఉండగా ఆ ఊసే ఎత్తడం లేదు. ఉమ్మడి జిల్లాలో కొత్తగా అంతర్భాగమైన కందుకూరు నియోజకవర్గంతో కలిపి 189 కిలోమీటర్ల సువిశాల సముద్ర తీర ప్రాంతం ఉంది. కావలి, బోగోలు, అల్లూరు, విడవలూరు, ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు, చిల్లకూరు, కోట, వాకాడు, సూళ్లూరుపేట, తడ, గుడ్లూరు, ఉలవపాడు మండలాల్లో మత్స్యకారుల జనాభా సుమారు 4 లక్షలు. వీరిలో ప్రత్యక్షంగా సముద్రం మీద ఆధారపడి జీవనం సాగించే మత్స్యకారుల సంఖ్య 50,000. వీరికి 8,500 ఫైబర్ బోట్లు, 4,500 సంప్రదాయ తెప్పలు ఉన్నాయి.



తమిళ కార్పొరేట్ శక్తుల తిష్ట

సముద్రంలోకి కార్పొరేట్లు రంగ ప్రవేశం చేశారు. దీంతో చేపల వేట మత్స్య పరిశ్రమగా మారింది. పెరిగిన పోటీ కారణంగా సంప్రదాయ బోట్లతో వేట సాధ్యపడడం లేదు. ఎక్కడైతే మత్స్యకారులు స్వేచ్ఛగా జీవనం సాగించారో అక్కడే కూలీలుగా బతకాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. తమిళనాడుకు చెందిన కార్పొరేట్ శక్తులు రూ.కోట్లు పెట్టుబడి, భారీ బోట్లతో రంగ ప్రవేశం చేశాయి. వలల సైజు మార్చి, సముద్రాన్ని ఊడ్చేయడం మొదలు పెట్టాయి. వీటన్నింటి ఫలితంగా చిన్న మత్స్యకారులు మామూలు బోట్లలో వేటకు వెళ్లినా చేపలు దొరకని పరిస్థితి నెలకొంది.

ప్రస్తుత పరిస్థితి ఇదీ..

ప్రస్తుతం ఫిషింగ్ హార్బర్ వద్ద బకింగ్‌హాం కెనాల్ ఉంది. దానిపై 7 మీటర్లు వెడల్పులో చిన్న దారి ఉంది. ఈ కొద్దిపాటి ఇరుకు దారి హార్బర్‌కు రాకపోకలకు అనువుగా లేదు. అందుకే బకింగ్‌హామ్ కెనాల్‌పై 40 మీటర్ల వెడల్పుతో మరో వంతెన నిర్మించాలి. దానికి కనీసం రూ.30 కోట్లు ఖర్చవుతుంది. ఆ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో చెప్పలేని పరిస్థితి.



ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులు కార్యకలాపాలకు చేపట్టిన నిర్మాణాలు



ఫిషింగ్ హార్బర్ వ్యూ

ఇదీ... తాజా పరిస్థితి

- చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ఫిషింగ్ హార్బర్ పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలలు తర్వాత అంటే 2 ఆగస్టు 2024న ఫిషింగ్ హార్బర్‌ను జిల్లాకు చెందిన మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి పరిశీలించారు. ఆరు నెలల్లో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పూర్తి చేస్తామని మంత్రి ఆనం ప్రకటించారు.
- ప్రధాని నరేంద్ర మోదీ 30 ఆగస్టు 2024న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను వర్చువల్ విధానంలో ప్రారంభించారు.
- 10.12.2024న కలెక్టర్ అధ్యక్షతన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ జిల్లా స్థాయి సలహా కమిటీ (డిస్ట్రిక్ట్ లెవల్ అడ్వైజరీ కమిటీ) ప్రథమ సమావేశం జరిగింది. దీనిని ప్రతి ఆరు నెలలకు ఒకసారి నిర్వహిస్తూ వివిధ భాగస్వాముల మధ్య వచ్చే వివాదాలను పరిష్కరించుకుంటూ, హార్బర్ నిర్వహణ, వివిధ రుసుముల (ఫీజులు) వసూలు తదితర అంశాలు చర్చించారు.

‘జువ్వలదిన్నె’కు వైఎస్ జగన్ శ్రీకారం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల శాశ్వత జీవనోపాధికి భరోసా కల్పించాలనే సంకల్పంతో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కావలి నియోజకవర్గంలోని బోగోలు మండలం జువ్వలదిన్నె వద్ద 116 ఎకరాల విస్తీర్ణంలో రూ.288.80 కోట్లతో నిర్మించేందుకు 18 మార్చి 2021న అప్పటి వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్మాణ సంస్థకు పనులు అప్పగించి, రెండేళ్లలో పూర్తి చేయాలని ఒప్పందం కుదుర్చుకుంది. మరుసటి రోజే.. అంటే 19 మార్చి 2021న ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులకు సీఎం హోదాలో వైఎస్ జగన్ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. 25,000 మత్స్యకార కుటుంబాలకు ప్రయోజనం కలగాలనే లక్ష్యంతో, 1,250 బోట్లు నిలిపేలా హార్బర్ పనులు చేపట్టారు. ఏటా 41,250 టన్నుల మత్స్య సంపద అదనంగా అందుబాటులోకి వస్తుందని అంచనా వేశారు.

నిర్వహణ కమిటీల ఏర్పాటుకు సన్నాహాలు

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్వహణకు కమిటీలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. బోట్ల యజమానులు, చేపల వ్యాపారస్తులు, చేపలు ఎండబెట్టే మహిళలతో కమిటీలు వేసి హార్బర్‌ను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. హార్బర్‌లో నిలిచే బోట్ల నుంచి వసూలు చేయాల్సిన ఫీజులు ఎంత అనేది నిర్ధారించడానికి ఇతర ఫిషింగ్ హార్బర్ల నుంచి సమాచారాన్ని సేకరిస్తున్నాం.

– ఎం.నాగేశ్వరరావు, జేడీ, జిల్లా మత్స్యశాఖ, నెల్లూరు

అలాగే హార్బర్‌కు ఉత్తరం వైపు రూ.5 కోట్లతో రోడ్డును కూడా నిర్మించాల్సి ఉంది.

పీఈటీ క్రీడా జట్ల ఎంపికలు రేపు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్ర వ్యాయామ విద్య, ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో కాకినాడలో జరిగే సెమినార్ కమ్ స్పోర్ట్స్ మీట్స్‌లో పాల్గొనే క్రీడా జట్ల ఎంపికలు ఆదివారం ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా పీఈటీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు (వాసు), థామస్ పీటర్ శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. స్త్రీ, పురుషలకు వివిధ క్రీడలు, అథ్లెటిక్స్‌లో ఎంపికలు నిర్వహిస్తున్నామన్నారు. కాకినాడలో ఈ నెల 8వ తేదీ నుంచి పదో తేదీ వరకు సెమినార్, స్పోర్ట్స్ మీట్ జరుగుతుందని వివరించారు. ఇతర వివరాలకు 94404 66189 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి సీపీఎం రాష్ట్ర మహాసభలు



నేడు, రేపు ప్రతినిధుల సమావేశం, 3వ తేదీ భారీ ర్యాలీ, బహిరంగ సభ

- హాజరుకానున్న పార్టీ కేంద్ర నాయకులు
- 47 ఏళ్ల తర్వాత ఆతిథ్యం ఇస్తున్న సింహపురి
- ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి

కమ్యూనిస్టు పోరాట యోధులకు, ఉద్యమాలకు పురిటిగడ్డ సింహపురి. దేశ స్థాయిలో చారిత్రాత్మక ఉద్యమ ఘట్టాలుగా నిలిచిన భూస్వామ్య వ్యతిరేక ఉద్యమాల నుంచి.. సారా వ్యతిరేక పోరాటం, అక్షరాస్యత ఉద్యమాలకు నెల్లూరు నుంచే అడుగులు పడ్డాయి. చట్ట సభల్లో కమ్యూనిస్టుల వాణి వినిపించిన పోరాట యోధులు పుచ్చలపల్లి సుందరయ్య, జక్కా వెంకయ్య పుట్టిన నేలపై నాలుగున్నర దశాబ్దాల తర్వాత రాష్ట్ర మహాసభలకు సింహపురి వేదికగా నిలుస్తోంది. కమ్యూనిస్టు ఉద్యమ పునరుత్తేజానికి.. సింహనాదం పూరించడానికి ఎర్రసైన్యం సన్నద్ధమైంది.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు పార్టీ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య, జక్కా వెంకయ్య వంటి పోరాటయోధుల సొంత గడ్డపై సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయి. నేటి నుంచి మూడు రోజుల పాటు జరగనున్న మహాసభలకు ఆతిథ్యం ఇస్తున్న నెల్లూరు నగరంలోని మాగుంట లేఅవుట్‌లోని అనిల్‌గార్డెన్స్‌లో సీతారాం ఏచూరి ప్రాంగణం సర్వం సిద్ధమైంది. వీఆర్సీ మైదానంలో ‘మల్లు స్వరాజ్యం’ ప్రాంగణం పేరుతో 3వ తేదీ భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ మహాసభలకు రాష్ట్రం నలుమూలల నుంచి 500 మందికి పైగా ప్రతినిధులు, కేంద్ర కమిటీ నుంచి పదుల సంఖ్యలో నాయకులు రానున్నారు. సీపీఎం ఇప్పటి వరకు ఎక్కడా జరగని రీతిలో మహాసభలు నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా దేశ స్థాయిలో కమ్యూనిస్టు ఉద్యమం పునరుత్తేజానికి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నారు.

సీపీఎం ఆవిర్భావానికి ‘పుచ్చలపల్లి’ ఆద్యుడు

1964వ సంవత్సరం వరకు దేశ రాజకీయాల్లో కీలకంగా ఉన్న సీపీఐ (కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా) విడిపోయి సీపీఎం (కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు)గా అవతరించింది. కమ్యూనిస్టు ఉద్యమ సారథి పుచ్చలపల్లి సుందరయ్య ప్రధాన పాత్ర పోషించారు. ఆ తర్వాత కాలంలో దేశంలోనే అతి పెద్ద పార్టీగా తీర్చిదిద్దారు. తొలిసారిగా సీపీఎం జాతీయ కార్యదర్శిగా అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి పుచ్చలపల్లి సుందరయ్య ఎన్నిక కావడం విశేషం. ప్రతి మూడేళ్లకు ఒకసారి పార్టీ మహాసభలు నిర్వహించడం జరుగుతోంది. దేశంలో ఎమర్జెన్సీ ఏర్పడిన తర్వాత పుచ్చలపల్లి సుందరయ్య పర్యవేక్షణలో 1978లో నెల్లూరులో 13వ సీపీఎం రాష్ట్ర మహాసభలు జరిగాయి. తిరిగి 47 ఏళ్ల తర్వాత 27వ మహాసభలకు నెల్లూరు సిద్ధమైంది.

ఎరుపెక్కిన నెల్లూరు నగరం

సీపీఎం రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్న నేపథ్యంలో నెల్లూరు నగరం ఎరుపెక్కింది. నగరంలోని వెంకటేశ్వరపురం నుంచి బుజబుజనెల్లూరు వరకు 54 డివిజన్లలో ఎక్కడ చూసిన ఎర్ర జెండాలతో అలంకరించారు. ప్రతి డివిజన్‌లో స్వాగత కటౌట్లు ఏర్పాటు చేశారు. ఈ రాష్ట్ర మహాసభలకు విశాఖపట్నం, పోలవరం, తాడేపల్లి, నంద్యాల, వైఎస్సార్ జిల్లాల నుంచి ఐదు ప్రధాన సమస్యలపై పతాక యాత్రలు ప్రచారం చేస్తూ శుక్రవారం రాత్రికి నెల్లూరు నగరానికి రానున్నాయి.

భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తాం



నెల్లూరులో జరిగే 27వ రాష్ట్ర మహాసభలో రానున్న 3 ఏళ్ల కాలంలో పార్టీ ప్రణాళికపై కీలక నిర్ణయాలకు కార్యాచరణ రూపొందిస్తాం. ప్రజా పోరాటాలు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టి తీసుకెళ్లి వారిని చైతన్యవంతులు చేయడానికి, పార్టీ బలోపేతం, కార్యకర్తలకు భరోసా కలిగించే ప్రతిపాదనలకు ప్రణాళికలు తయారు చేస్తాం.

– వి.శ్రీనివాసరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి

పోరాట యోధుల స్ఫూర్తితో..



నెల్లూరు ఎన్నో ప్రజాపోరాటాలకు, ఉద్యమాలకు పురిటిగడ్డ. పోరాట యోధులు పుచ్చలపల్లి సుందరయ్య, జక్కా వెంకయ్య వంటి నేతల స్ఫూర్తితో సీపీఎం ప్రధాన భూమిక పోషించే విధంగా భవిష్యత్ కార్యాచరణకు నాంది పలకబోతున్నాం. ప్రజల పక్షాన నిలిచి ప్రజాపోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

– మూలం రమేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి

ఫీజు పోరుకు సన్నద్ధమవ్వండి



ఫీజు పోరు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి వైఎస్సార్‌సీపీ ఆందోళన
- ఫిబ్రవరి 5న జిల్లా కేంద్రంలో ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట ధర్నా
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- జిల్లా పార్టీ కార్యాలయంలో విద్యార్థి సంఘ నేతలతో కలిసి పోస్టర్ ఆవిష్కరణ

నెల్లూరు (బారకాసు): విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే ఇవ్వాలంటూ తమ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు 5న ‘పోరుబాట’ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం నగరంలోని డైకస్‌రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో విద్యార్థి సంఘాల ప్రతినిధులు, విద్యార్థులతో కలిసి ‘ఫీజుపోరు’ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ ఫీజు పోరు కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి 5న నగరంలోని వీఆర్సీ కూడలి నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు వైఎస్సార్‌సీపీ నేతలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి భారీ ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం విద్యాదీవెన కింద రూ.2,800 కోట్లు, వసతిదీవెన కింద రూ.1,100 కోట్లు కలిపి మొత్తం రూ.3,900 కోట్లు బకాయిలు పెట్టిందన్నారు. దీంతో కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులను తరగతులకు రానివ్వడం లేదని, సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని తెలిపారు. పేద విద్యార్థులు చదువులు మానుకుని కూలి పనులు చేసుకోవాల్సిన దుస్థితిని సీఎం చంద్రబాబు కల్పించారని ధ్వజమెత్తారు. ప్రతి పేద విద్యార్థి ప్రపంచ స్థాయిలో పోటీ పడాలని ఆకాంక్షిస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తే చంద్రబాబు వారి భవిష్యత్‌తో చెలగాట మాడుతున్నారని మండిపడ్డారు. పేద కుటుంబాలకు పిల్లల చదువులు భారం కాకూడదనే ఉద్దేశంతో దివంగత వైఎస్సార్ రూపకల్పన చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పటిష్టంగా అమలు చేశారన్నారు. విద్యార్థులకు జరుగుతున్న ఈ అన్యాయాన్ని వైఎస్సార్‌సీపీ చూస్తూ ఊరుకోదని, కచ్చితంగా ఈ ప్రభుత్వం మెడలు వంచి విద్యార్థులకు న్యాయం జరిగేలా పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా కళ్లు తెరచి ఫీజు బకాయిలు విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 5న తలపెట్టిన ‘ఫీజు పోరు’లో పార్టీ శ్రేణులు, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని జయప్రదం చేయాలని కాకాణి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్‌ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి, పార్టీ విద్యార్థి విభాగంగా జిల్లా అధ్యక్షుడు అశ్రిత్‌రెడ్డి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు లక్ష్మీసునంద తదితరులు పాల్గొన్నారు.

3,08,266 మందికి పింఛన్లు

- రూ.132 కోట్ల నగదు పంపిణీ

నెల్లూరు (పొగతోట): సామాజిక పింఛన్ల పంపిణీ ప్రక్రియకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా 3,08,266 మంది లబ్ధిదారులకు రూ.132 కోట్ల నగదు పంపిణీ చేసేందుకు సచివాలయాల సిబ్బందికి, పంచాయతీ సెక్రటరీలు అందజేశారు. ఈ నెల 1వ తేదీ ఉదయం నుంచి పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

పుస్తకాలు.. జ్ఞాన జ్యోతులు

సింహపురిలో పుస్తక మహోత్సవం

- పాఠకుల నుంచి విశేష ఆదరణ
- 3వ తేదీ వరకు అందుబాటులో..



వీఆర్సీ ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన సింహపురి పుస్తక మహోత్సవం


వివిధ పుస్తకాలు

నెల్లూరు(బృందావనం): పుస్తకం.. దీని విలువ వెలకట్ట లేదని. మనిషికి మంచి నేస్తంగా పేరు పొందింది. చాలామంది పుస్తకాన్ని పట్టుకుంటే పూర్తయ్యే వరకూ వదిలిపెట్టరు. మరో లోకంలోకి వెళ్లిపోతారు. వాటిల్లో మనం నేర్చుకోవాల్సిన, గుర్తుంచుకోవాల్సిన విలువైన సమాచారం ఉంటుంది. పుస్తకాలు చదివితే స్నేహితుడితో సంభాషించినట్లు ఉంటుందని పెద్దలంటారు. ఎంతోమంది అనుభవజ్ఞులు తమ అనుభవాలను రంగరించి లిఖించిన రాతలతో మనకు విజ్ఞానం లభిస్తుంది. జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు, సాధించాలనుకున్న లక్ష్యాలకు పుస్తకాలు పునాదిగా ఉంటాయి. నెల్లూరు నగరంలోని వీఆర్ ఉన్నత పాఠశాల మైదానంలో సింహపురి పుస్తక మహోత్సవం జరుగుతోంది. దీనికి విశేష ఆదరణ లభిస్తోంది.

మొదటిసారిగా..

ఆన్‌లైన్ మార్కెటింగ్, పీడీఎఫ్ ఫైల్స్ అందుబాటులోకి వచ్చిన ప్రస్తుత తరుణంలో పుస్తకానికి ఆదరణ ఉండదని భావించారు. అయితే ఇటీవల హైదరాబాద్‌లో, విజయవాడలో నిర్వహించిన పుస్తక మహోత్సవాలకు ఎనలేని ఆదరణ లభించింది. జిల్లాల్లోనూ నిర్వహించాలన్న ఆలోచనతో తొలిసారిగా నెల్లూరులో సింహపురి పుస్తక మహోత్సవానికి శ్రీకారం చుట్టారు. పాఠకుల ఆదరాభిమానాలను చూసి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పుస్తక మహోత్సవాలు ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు సమాయత్తమవుతున్నారు. నెల్లూరులో ఫిబ్రవరి 3వ తేదీ వరకు ఇది జరుగుతుంది. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో వంద ప్రముఖ సంస్థలు ముద్రించిన సుమారు 50 వేల పుస్తకాలను అందుబాటులో ఉంచారు. ఇందులో బాలసాహిత్యం నుంచి పరిశోధనలకు ఉపయుక్తమైన పుస్తకాలతోపాటు కథ, నవల, చరిత్ర, జీవిత చరిత్ర, అనువాద, వ్యక్తిత్వ వికాస, పరిశోధనాత్మకమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.

విద్యార్థుల్లో పఠనాసక్తిని కలిగించాలి



మేమిద్దరం ఆత్మకూరు, నల్లపరెడ్డిపల్లిలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నాం. విద్యార్థుల్లో పఠనాసక్తిని కల్పించేందుకు సొంత నిధులతో మా పాఠశాలలకు అవసరమైన పుస్తకాలను కొనేందుకు వచ్చాం. పుస్తక పఠనంతో సంస్కృతి, సంప్రదాయాలు, విజ్ఞానం పెంపొందాలన్నదే మా ఆకాంక్ష.

– హెచ్.మురళీకృష్ణ, ఎస్వీ ప్రసూన, ఆత్మకూరు

ఊహించనిరీతిలో ఆదరణ



పుస్తకాలకు ఆదరణ తగ్గలేదన్న విషయాన్ని సింహపురి పుస్తక మహోత్సవం రుజువు చేసింది. ఊహించని రీతిలో స్పందన రావడం ఎంతో ఆనందంగా ఉంది. సింహపురి స్ఫూర్తితో రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో పుస్తక మహోత్సవాలను ఏర్పాటు చేస్తాం.

– కె.లక్ష్మయ్య, కన్వీనర్, విజయవాడ బుక్ ఫెస్టివల్ కమిటీ

ఉన్నతంగా ఎదిగేందుకు..



నేను నెల్లూరులో ఓ సీడ్స్ కంపెనీలో మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నా. జీవితంలో మరింత ఉన్నతంగా ఎదగాలన్న కాంక్షతో మనోనిబ్బరంతోపాటు, ఆత్మస్థైర్యం కలిగించే పుస్తకం కోసం వచ్చాను.

– కె.మణికంఠ, పొదిలి

సంతోషంగా ఉంది



జిల్లాలో వామపక్ష ఉద్యమానికి బీజం వేసిన ఎందరో ప్రముఖుల జీవిత చరిత్రలతోపాటు స్ఫూర్తిని కలిగించే ప్రముఖుల విశేషాలతో ముద్రితమైన పుస్తకాలు కొనేందుకు వచ్చాను. ఎన్నో పుస్తకాలు ఒకేచోట ఉండటం సంతోషంగా ఉంది. జిల్లా చరిత్రను, నాయకుల జీవనశైలిని నేటితరం తెలుసుకోవాలి.

– జి.గిరి, నెల్లూరు

స్ఫూర్తిని కలిగించే పుస్తకాలు



నగరంలో ఓ బ్యాంక్‌లో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నా. సరికొత్త ఆలోచనల కోసం, స్ఫూర్తిని కలిగించి జీవనగమనానికి తోడ్పడే పుస్తకాల కోసం వచ్చాను.

– టి.స్టీఫెన్‌బాబు, బ్యాంక్ ఉద్యోగి, నెల్లూరు

ఉన్నత చదువులకు..

నెల్లూరులో ఎంబీఏ, ఎంసీఏ చదువుతున్నాం. ఉన్నత చదువులకు ఉపయోగపడే పుస్తకాల కోసం వచ్చాం. ఇక్కడ ఎన్నో బుక్స్ ఉండటం ఆనందంగా ఉంది.

– ఎ.వినీత, టి.కీర్తి, కె.కల్యాణి

పేదల సంక్షేమమే లక్ష్యం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు


పుస్తకావిష్కరణలో వి.శ్రీనివాసరావు, సీతారామ్

నెల్లూరు(బృందావనం): 'పేద, కార్మిక వర్గాల సంక్షేమమే కమ్యూనిస్టు పార్టీల లక్ష్యం. వామపక్షానికి చెందిన నేతలెందరో ప్రజల కోసం తమ జీవితాలను త్యాగం చేశారు' అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. సింహపురి పుస్తక మహోత్సవంలో భాగంగా నగరంలోని వీఆర్సీ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం రాత్రి ఆరుద్ర సాహిత్య వేదికపై జిల్లా కమ్యూనిస్టు ఉద్యమంపై ఆయన మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు మాదాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. 'ఉద్యమపథంలో నేను' – జక్కా వెంకయ్య పుస్తకాన్ని శ్రీనివాసరావు, 'నెల్లూరు జిల్లా కమ్యూనిస్టు ఉద్యమం అమరవీరులు పోరాటయోధులు' పుస్తకాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు మంతెన సీతారామ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు డి.రమాదేవి, ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు కె.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రజల్లో చైతన్యం కలిగించే కార్యక్రమాలను నిర్వహించారు.

కండలేరులో 54.676 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 54.676 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరుకు సోమశిల జలాశయం నుంచి 180 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. అలాగే కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 650, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 170, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

యూరియా లారీకి ప్రమాదం

రాపూరు: యూరియా లోడుతో వెళ్తున్న లారీకి ప్రమాదం జరిగిన ఘటన మండలంలోని సిద్ధవరం తెలుగుగంగ బ్రిడ్జి సమీపంలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. కోవూరు నుంచి వెంకటగిరికి యూరియా బస్తాలను తీసుకెళ్తున్న లారీ సిద్ధవరం సమీపంలో తెలుగుగంగ కాలువ వద్ద ఉన్న మలుపులో అదుపు తప్పింది. దీంతో యూరియా బస్తాలు కింద పడిపోయాయి. డ్రైవర్ మహబూబ్‌బాషాకు స్వల్పగాయాలయ్యాయి.

నేషనల్ వీల్‌చైర్ క్రికెట్ పోటీలకు ఎంపిక


పెంచలయ్య

పొదలకూరు: నాలుగో జాతీయ వీల్‌చైర్ క్రికెట్ పోటీలకు సంబంధించి ఏపీ జట్టుకు మండలంలోని మొగళ్లూరు గ్రామానికి చెందిన కంభాపు పెంచలయ్య ఎంపికయ్యాడురు. మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లో ఫిబ్రవరి 5 నుంచి 15వ తేదీ వరకు ఈ పోటీలను నిర్వహిస్తారు. ఏడేళ్లుగా పెంచలయ్య జాతీయ స్థాయిలో వివిధ పోటీల్లో ఆడాడు.

జంతు సంరక్షణపై అవగాహన రేపు

నెల్లూరు(సెంట్రల్): జంతు సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని ఈనెల 2వ తేదీన నెల్లూరులోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు షీప్ డెవలప్‌మెంట్ సహాయ సంచాలకురాలు మాధవీలత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైల్వే ఫీడర్స్ రోడ్డులో ఉన్న కార్యాలయంలో ఈ కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 120
లేయర్ (లైవ్) : 85
బ్రాయిలర్ చికెన్ : 216
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 240
లేయర్ చికెన్ : 145



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.30
సన్నవి : రూ.20
పండ్లు : రూ.10

గిరిజనులపై కక్ష సాధింపు తగదు


ఆందోళన చేస్తున్న గిరిజన సంఘం నేతలు

సైదాపురం: గిరిజనులపై కక్ష సాధింపు తగదని, వారి జోలికొస్తే సహించేది లేదని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్రాధ్యక్షుడు కల్లూరు పెంచలయ్య తెలిపారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం వారితో కలిసి సైదాపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా భూస్వామి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గిరిజనులకు నోటీసులివ్వడం దారుణమన్నారు. ఆక్రమణల తొలగింపు విషయంలో రెవెన్యూ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. శివయ్య ఆత్మహత్యాయత్నానికి కారకులైన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నేతలు మానికల మురళి, మాకాని రవీంద్రబాబు, చెంచు మల్లికార్జున, చెంబేటి ఉష, మల్లి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల నుంచి ఇంటికెళ్తుండగా..

- ఆర్టీసీ బస్సు టైర్ కింద నలిగిన ప్రాణం

నెల్లూరు(క్రైమ్): ఆర్టీసీ డ్రైవర్ బస్సును ముందుకు కదల్చడంతో ఓ విద్యార్థి అదుపుతప్పి టైర్ కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. నెల్లూరు నార్త్ ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు.. కొడవలూరు మండలం రేగడిచెలికకు చెందిన మహీంధర్ (18) నెల్లూరు నగరంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. గురువారం సాయంత్రం అతను కళాశాల నుంచి ఇంటికెళ్లేందుకు ఆత్మకూరు బస్టాండ్‌లో బస్సు ఎక్కాడు. అది మినీలారీ స్టాండ్ వద్దకు వచ్చేసరికి కొందరు ఆపారు. ఈ క్రమంలో మహీంధర్ కిందకు దిగాడు. ప్రయాణికులు ఎక్కారు. అనంతరం మహీంధర్ ఎక్కుతుండగా డ్రైవర్ ముందుకు కదల్చడంతో అదుపుతప్పి బస్సు వెనుక టైరు కింద పడ్డాడు. తలకు తీవ్రగాయాలైన మహీంధర్‌ను స్నేహితుడు కిశోర్ ఆటోలో చికిత్స నిమిత్తం నారాయణ ఆస్పత్రికి తరలించి బాధిత కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాత్రి విద్యార్థి మృతిచెందాడు. మృతుడి తండ్రి మస్తానయ్య నార్త్ ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. శుక్రవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బాధిత కుటుంబానికి అప్పగించారు.

వైఎస్సార్‌సీపీ నేతపై పచ్చమూకల దాడి


చికిత్స పొందుతున్న మోహన్‌రావు

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో వైఎస్సార్‌సీపీ నేత కొడవలూరు మోహన్‌రావుపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నేతలు శుక్రవారం దాడిచేసి గాయపరిచారు. మోహన్‌రావు పార్టీ వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొంటున్నాడని తెలుగు తమ్ముళ్లు అక్కసు పెంచుకున్నారు. ఆయన యల్లాయపాళెంలో ఉన్న పొలానికి వెళ్లి తిరిగి వస్తుండగా పచ్చమూకలు దాడికి తెగబడ్డాయి. వృద్ధుడైన తనపై కక్షలేమిటని బతిమిలాడినా వినకుండా ముష్టిఘాతాలు కురిపించారు. దీంతో కుడిచేతి చూపుడు వేలు విరిగింది. గాయాలయ్యాయి. బాధితుడిని స్థానికులు 108 అంబులెన్స్‌లో నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నార్తురాజుపాళెనికి చెందిన టీడీపీ నాయకుడు మందిపాటి ప్రవీణ్‌కుమార్ రెడ్డి, యల్లాయపాళెనికి చెందిన నేత గరికపాటి రాజేంద్ర, మయూరి సిద్ధార్థ ఇంకొంత మంది దాడికి పాల్పడ్డారని మోహన్‌రావు తెలిపారు. ఆయన్ను మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావులు పరామర్శించారు.

టిడ్కో సముదాయాల్లో రామాలయాల నిర్మాణం


మాట్లాడుతున్న ఆనం

నెల్లూరు రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టిడ్కో గృహాల సముదాయాల్లో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో రామాలయాల నిర్మాణం చేపట్టనున్నట్లు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. శుక్రవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 9వ తేదీన ఆత్మకూరు పట్టణానికి సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నామని వెల్లడించారు. దీనికి మంత్రులు హాజరవుతారన్నారు. ఆత్మకూరు టిడ్కో కాలనీలో రామాలయానికి శంకుస్థాపన చేస్తామన్నారు.

అటవీ భూముల్లో జామాయిల్ నరికివేత

- నలుగురిపై కేసు నమోదు

జలదంకి: మండలంలోని చోడవరం అటవీ ప్రాంతంలో గురువారం అర్ధరాత్రి అక్రమంగా జామాయిల్‌ను నరికి ఇతర ప్రాంతానికి తరలిస్తుండగా కావలి అటవీ శాఖాధికారులు దాడులు నిర్వహించారు. చోడవరానికి చెందిన నన్నూరి వీరయ్య, చెరుకూరి కొండయ్య, నన్నూరి మహేంద్ర, టి.మనోహర్ అనే నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని, ట్రాక్టర్‌ను కావలి అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. శుక్రవారం ఫారెస్ట్ రేంజ్ అధికారి కె.రామిరెడ్డి మాట్లాడుతూ చోడవరం అటవీ ప్రాంతంలో అక్రమంగా జామాయిల్‌ను నరికి తరలిస్తున్నారని ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందడంతో దాడులు నిర్వహించామన్నారు. నలుగురిపై కేసు నమోదు చేశామన్నారు. జరిమానా విధించినట్లు తెలిపారు.